క్లుప్తంగా

ఎంసెట్ మెటీరియల్ పంపిణీ



ఎంసెట్ మెటీరియల్ అందజేస్తున్న తాండ్ర వెంకటేశ్వరరావు

పాల్వంచరూరల్: బస్వతారాక కాలనీ పంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత ఎంసెట్ కోచింగ్ పుస్తకాలను శుక్రవారం తాండ్ర వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాలలో ఒకేషనల్ కోర్సు, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని దాతలు స్పందించాలని కోరారు. స్పందించిన తాండ్రా వెంకటేశ్వరరావు తాను గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశానని, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఎల్‌ఓసీ అందజేత

టేకులపల్లి: కొండంగులబోడు గ్రామానికి చెందిన జె.విద్యశ్రీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. నిరుపేద కావడంతో ఎమ్మెల్యేను ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫారసు చేశారు. మంజూరు కావడంతో శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ బాధితురాలి తండ్రి గణేష్‌కు రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ అందజేశారు.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

కొత్తగూడెంటౌన్: చిరువ్యాపారుల జీవితాలతో చెలగాటం తగదని జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌ను తొలగించడం దారుణమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ శ్రావణబోయిన నర్సయ్య ముదిరాజ్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం కూలీలైన్‌లోని రైతుబజార్ కూరగాయల మార్కెట్‌లో ఆయన మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం రూ.25 లక్షలతో నాటి ప్రభుత్వం సహకారంతో ఈ మార్కెట్‌ను నిర్మించినట్లు చెప్పారు. ఇప్పుడు అకస్మికంగా మార్కెట్‌ను కూల్చివేయడంతో చిరువ్యాపారులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం నోటీసులు ఇవ్వక పోవడం దారుణం అన్నారు.

పేదలకు అండగా టీఎస్ఆర్ ట్రస్ట్

సింగరేణి(కొత్తగూడెం): పేద ప్రజలు, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్న టీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు మరింత విస్తరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం బేడ బుడిగజెంగాల కాలనీలో మినీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం టీఎస్ఆర్ ట్రస్ట్ రూ 2.లక్షలు సహకారం అందించారు. అట్టి సహాయాన్ని శుక్రవారం కాలనీ కమిటీకి అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూనంనేని హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, నరాటి ప్రసాద్, మందా గాబ్రియల్, పి.శంకర్, దుబ్బాటి సారయ్యపాల్గొన్నారు.

వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

ఇల్లెందు: రాష్ట్ర వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పని చేస్తున్న డెయిలీవేజ్ వర్కర్లు, ఔట్ సోర్సింగ్ వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. శుక్రవారం పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి జే.గణేష్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఔట్ సోర్సింగ్, డెయిలీవేజ్ వర్కర్ల ఆందోళనను సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. రోజుల తరబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.

పూసల సంఘం అధ్యక్షుడిగా రాము

ఇల్లెందు: ఇల్లెందు మండల పూసల కుల సంఘం అధ్యక్షుడిగా బండి రామును ఎన్నుకున్నారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పొదిలి సర్వయ్య, పొదిలి రాము, సంగు భీమేష్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన మండల కమిటీని ఎన్నిక చేశారు. మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా తుపాకుల వెంకటేశ్వర్లు, మద్దిశెట్టి ఉప్పలయ్య, న్యాయసలహాదారుడుగా పసుపులేటి యాకయ్యలను ఎన్నుకున్నారు.

‘డబుల్’ ఇళ్లు మంజూరు చేయండి

ఇల్లెందురూరల్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాపంథా ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కృష్ణవేణికి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న రాష్ట్రంలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు.

నాణ్యతకు తిలోదకాలు..

సుజాతనగర్‌కు చెందిన ఓ ప్రయాణికుడు కుటుంబ సభ్యులతో కలిసి హన్మకొండకు వెళ్లేందుకు కొత్తగూడెం బస్టాండ్‌కు వచ్చాడు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఉన్న ఓ దుకాణంలో లీటరు బ్రాండెడ్ మంచినీళ్ల బాటిల్ కొన్నాడు. అసలు బ్రాండెడ్ వాటర్ బాటిల్ అమ్మాల్సింది రూ.20 కాగా, షాపు యజమాని అదనంగా రూ.25 తీసుకున్నాడు. బయటకు వెళ్లలేక తప్పని సరి పరిస్థితుల్లో వాటర్ బాటిల్ కొనాల్సి వచ్చిందని ప్రయాణికుడు చెప్తున్నాడు. ఇదీ కొత్తగూడెం బస్టాండ్‌లో అదనపు బాదుడు పరిస్థితి...



కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాలు

- నాసిరకం ఆహార పదార్థాల విక్రయం
- ప్రయాణికులపై అదనపు బారం
- ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాల తీరు

మంచుపల్లి: ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో ప్రయాణికులకు అదనపు బాదుడు తప్పడం లేదు. వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్లలో తమ అవసరాల కోసం ఆహార పదార్థాలతో పాటు మంచినీళ్లను కొనుగోలు చేస్తారు. బయటికి వెళ్లలేక అక్కడే తమకు అవసరమైన తినబండాలు కొంటుంటారు. ప్రయాణికుల అత్యవసరాన్ని ఆసరా చేసుకుని షాపుల యజమానులు నాణ్యత లేని ఆహార పదార్థాలను అంటగడుతూ అధిక ధరలతో సొమ్ము చేసుకుంటున్నారు. అవి తిన్న ప్రయాణికులు సైతం అనారోగ్యానికి గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల దుకాణదారుల వ్యాపార దందా యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు తనిఖీలు చేసే సమయంలో మాత్రమే అప్రమత్తంగా ఉంటూ కచ్చితమైన ధరలకు అమ్ముతున్నారు. ఆ తర్వాత రెండు రోజులకే షరా మామూలే... కొత్తగూడెం బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న పలు దుకాణాల నిర్వాహకులు కొంతకాలంగా ఆహారపదార్థాలకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం తినుబండారాల ప్యాకెట్లపై అవి తయారు చేసిన తేదీ ముద్రించాల్సి ఉండగా అది ఎక్కడా కనిపించడం లేదు. అలాంటి వాటిని తయారు చేసిన 15–20 రోజుల్లో మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. బ్రాండెడ్ ఆహార పదార్థాలు, తినబండారాలకు బదులు నాణ్యత లేని నాసిరకమే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక మంచినీళ్ల సీసాల విషయంలో కంపెనీ వాటర్ బాటిల్ లీటరు రూ.20 ఉండగా, ఇక్కడ మాత్రం రూ.25 ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. నాసిరకం మంచినీళ్ల బాటిళ్లను కూడా బ్రాండెడ్ సీసాల మాదిరిగానే రూ.20 చొప్పున అమ్ముతున్నారు. ఎవరైనా ప్రయాణికులు ఇదేమిటని ప్రశ్నిస్తే.. కొంటే కొనండి లేకపోతే లేదు.. ఇక్కడ ఇంతే అని ఘాటుగా సమాధానం చెప్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో చేసేదేమీ లేక వాటిని అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కొత్తగూడెం బస్టాండ్ ప్రయాణంలో పదికి పైగా దుకాణాలు ఉన్నాయి. వాటిలో విక్రయించే తినబండారాల నాణ్యతపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆహార తనిఖీ అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు. దీంతో వ్యాపారుల ఆగడాలకు అదుపు లేకుండా పోయింది. ఇటీవల ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో పలు విషయాలు వెలుగులోకి రావడంతో షాపుల యజమానులకు జరిమానా విధించారు. బస్టాండ్‌లోని షాపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అధిక ధరలతో పాటు నాణ్యతలేని తినుబండారాలను అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఓ షాపులో నాసిరకం వాటర్ బాటిళ్లు

అధికారులు నియంత్రించాలి



ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లోని షాపుల యజమానులు తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు నిత్యం పర్యవేక్షించి ధరలను నియంత్రించాలి. అధిక రేట్లకు అమ్మకాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– భూక్యా రమేష్

చర్యలు తీసుకుంటాం



కొత్తగూడెం బస్టాండ్‌లోని షాపుల యజమానులకు ఎమ్మార్పీకే అమ్మాలని సూచనలు చేశాం. అయినా కొందరు అధిక ధరలకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. అలాంటి వారిని గుర్తించి జరిమానాలు కూడా వేశాం. ఎమ్మార్పీకి మించి అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– బి.వెంకటేశ్వరరావు, డీఎం, కొత్తగూడెం

కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలి



డీఎం వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

మంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో రోజురోజుకూ కార్మికులపై పనిభారం పెరుగుతోందని కొంత వెసులుబాటు కల్పించాలని కోరుతూ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం డీఎం వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు అత్యవసర సమయాల్లో కూడా సెలవులు దొరికే పరిస్థితి లేదని, ఒకవేళ సెలవు మంజూరైనా దానిపై గ్రాంట్ లీవ్ విత్‌అవుట్ పే అని రాసి కార్మిక చట్టాలను వినియోగించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వీటితోపాటు ఓఆర్ ఎక్కువగా వచ్చే సర్వీసులను తగ్గించి డ్రైవర్లు ఎక్కువగా ఉన్నారని హైదరాబాదు, నిజామాబాద్, ఆదిలాబాద్ రీజియన్‌కు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు రూట్లకు డ్రైవర్లు తక్కువగా ఉన్నారని రోజుకు 10 నుంచి 15 మంది డ్రైవర్లకి డీడీలు వేస్తూ బలవంతంగా డ్యూటీలకు పంపిస్తున్నట్లు చెప్పారు. భద్రాచలం గుంటూరు 18 గంటల డ్యూటీని తగ్గించాలని కోరారు. విజయవాడ భద్రాచలం డ్యూటీలను సింగిల్ క్రూగా మార్చడంతో 14 గంటలు డ్యూటీ చేయాల్సి వస్తోందని, వీటిని మళ్లీ స్పెషల్ ఆఫ్ డ్యూటీగా మార్చాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వి.జాకబ్, పీవీ ప్రసాద్, ఎస్సార్ బాబు, బి.రమేష్, వైఎస్ రావు, జానీమియా, శంకర్, ఖలీల్ పాషా, సరస్వతి, సంధ్య, వి.ఎస్ వాసు, మోహినుద్దీన్ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

కొత్తగూడెంరూరల్: జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరగనున్న మెగా జాబ్ మేళాకు సర్వం సిద్ధం చేశారు. హైదరాబాద్ నుంచి 80 కంపెనీలు యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నా రు. ఇప్పటి వరకు జీఎస్ఆర్ ట్రస్ట్ ఉపాధి వెబ్‌సైట్‌లో సుమారు 6,500 వేల మంది ఉపాధి కోసం రిజిష్టర్ చేసుకున్నారు. ఈ మేరకు చైర్మన్ గడల శ్రీనివాసరావు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు.

8న ముగ్గుల పోటీలు

పాల్వంచ: ఈనెల 8న బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 1గంట నుంచి నిర్వహించనున్న సంక్రాంతి ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని మహిళా సమైక్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీసంశెట్టి పద్మజ అన్నారు. శుక్రవారం స్థానిక సీఆర్‌భవన్‌లో మాట్లాడారు.

9న క్రికెట్ టోర్నీ

జూలూరుపాడు: 9న జూలూరుపాడులో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చల్లగుండ్ల సతీష్, కల్లోజి నరేష్, జాలాది అవినాష్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ మొదటి బహుమతి రూ.15,116, ద్వితీయ రూ.10,116, తృతీయ రూ.8,116, నాలుగో బహుమతి రూ.6,116, షీల్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.800 వివరాలకు 9502139274లో సంప్రదించాలని కోరారు.

వర్క్ ఆర్డర్ అందజేత

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందులో వాటర్ వర్క్స్ సప్లై విభాగంలో సెమీ స్కిల్ కాంట్రాక్ట్ వర్కర్స్ టెండర్‌ను కొమురం భీం గిరిజన సొసైటీకి అందజేశారని ఆ సంఘం జిల్లా నాయకులు గొగ్గెల రామస్వామి, తాటి మధు తెలిపారు. శుక్రవారం ఏరియా సింగరేణి అధికారుల నుంచి వర్క్ ఆర్డర్ అందుకున్న వారు మాట్లాడుతూ.. టెండర్ తమకు దక్కకుండా చేసేందుకు జరిగిన ప్రయత్నాలను అడ్డుకుని ఆందోళన చేశామని, ఎట్టకేలకు తమ సంఘానికి టెండర్ దక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం షాలేమురాజు, సింగరేణి అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైల్వే స్టేషన్‌కు ‘కోయగూడెం’ పేరు పెట్టండి

సుజాతనగర్: కోయగూడెం గ్రామంలో నిర్మించిన రైల్వే స్టేషన్‌కు ‘కోయగూడెం’పేరే పెట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు మూతి రామకృష్ణ మాట్లాడుతూ.. భద్రాచలం, సత్తుపల్లి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా కోయగూడెం గ్రామంలో రైల్వే స్టేషన్ నిర్మించడం జరిగిందన్నారు. ఈ స్టేషన్ నిర్మాణం కోసం గ్రామంలోని చాలామంది ఆదివాసీలు తమ భూములు కోల్పోయినట్లు చెప్పారు. నిర్మాణం అనంతరం రాజకీయ నాయకుల ఒత్తిడితో సర్వారం అని పెట్టినట్లు ఆరోపించారు. గ్రామసభ తీర్మానం లేకుండా మరో పేరు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈసం పెద్ద రాములు, ఈసం పాపారావు, కంగల వెంకటేశ్వర్లు, ఈసం గోపమ్మ, తాటి విజయ్, కృష్ణమోహన్, ఈసం అనసూయ, ఝాన్సీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం ఉండాలి



కిట్లు అందజేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

పాల్వంచ: విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఇతరులకు సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని, ఉన్నత లక్ష్యాల దిశగా కృషి చేయాలని మండల గణాంక అధికారి యేసు కరుణా స్వచ్ఛంద సేవా అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు (ప్రభుదాస్) అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు రైల్వే ఉద్యోగి అద్దంకి విజయ్‌బాబు సహకారంతో రూ.25వేల విలువ చేసే కొబ్బరినూనె, సబ్బులు, షాంపుల కిట్లను 250 మంది విద్యార్థినులకు అందించారు. మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ఉన్నత అలవాట్లు కలిగి ఉండాలని, అన్ని విషయాల్లో పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తులసీ, అడవికట్ల సురేష్, కొండ్లె రవి, కాటయ్య బాబు, నకిరికంటి లక్ష్మణ్, జగదీశ్, కృపాకర్, ప్రీతమ్, శ్రీను, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించండి



సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్కీమ్ వర్కర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మొదట సీఐటీయూ కార్యాలయం నుంచి అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ సిబ్బంది, వీఓఏలు, అన్ని విభాగాలలో పనిచేసే స్కీమ్ వర్కర్లు ప్రదర్శనగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ పట్టణ కార్యదర్శి డి.వీరన్న అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా ఉపాధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర పద్మ మాట్లాడుతూ.. స్కీమ్‌లకు బడ్జెట్ కేటాయించకుండా వాటిని ప్రైవేట్‌పరం చేస్తూ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. భూక్యా రమేష్, కె.సత్య, రమణ, కళావతి, మాధవి, హేమలత పాల్గొన్నారు.

టేకులపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా నేత అబ్దుల్‌నబీ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా స్కీం వర్కర్ల నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ బోయిన లావణ్యకు వినతిపత్రం అందజేశారు. కొండపల్లి శకుంతల, మజహరి, అనసూయ, చిట్టెమ్మ, భద్రమ్మ, రాజేశ్వరి, సుజాత, మాధవి, హైమవతి, మంగతాయారు, రాధ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీమ్ వర్కర్ల రక్షణ, హక్కుల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. తహసీల్ ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు నబీ, తాళ్లూరి కృష్ణ, ఫాతిమా, లక్ష్మణ్, రమణి, పద్మజ, ఆదిలక్ష్మి, దయావతి, వెంకటమ్మ, సుభద్ర, పార్వతి, యశోద, స్వరూప పాల్గొన్నారు.

నిధులపై ఆంక్షలు.. సర్పంచ్‌లకు అవమానం



సమావేశమైన సర్పంచ్‌లు

ఇల్లెందురూరల్: పంచాయతీలకు మంజూరైన నిధులు వినియోగించుకోకుండా ఆంక్షలు విధించడం సరైంది కాదని, ఈ చర్యలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సర్పంచ్‌ల సంఘం మండల శాఖ అధ్యక్షుడు కుంజ కృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామపంచాయతీ అకౌంట్‌లలో నిల్వ ఉన్న నిధులను కేవలం గ్రామపంచాయతీ వర్కర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు, ట్రాక్టర్ ఈఎంఐ, విద్యుత్ చార్జీలకు సంబంధించి చెక్కులను డిజిటల్ కీ ద్వారా ఆన్‌లైన్ చేయడం తమను అవమానించడమేనని వాపోయారు. బిల్లులు కూడా పాస్ కాకుండా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేయడం తమను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇదే విషయమై జిల్లా వ్యాప్తంగా సర్పంచ్‌లను సమీకరించి సోమవారం కలెక్టరేట్ ముట్టడి చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపీఓ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు.

టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జీపుజాతా



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పాల్వంచరూరల్: జాతీయ విద్యావిధానం, నూతన పెన్షన్ స్కీమ్‌లను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతాను శుక్రవారం జగన్నాథపురం హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంలో నిర్దేశించిన లౌకిక ప్రజాస్వామిక, సామాజిక విలువల ప్రస్తావనే లేని నూతన జాతీయ విద్యావిధానం 2020, భారతదేశ అవసరాలకు అనుగుణంగా లేదని, లౌకిక ప్రజాస్వామిక, శాస్త్రీయ విలువలతో కూడిన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని, 3 – 18 సంవత్సరాల పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందించాలని, దేశ జీడీపీలో పదిశాతం విద్యకు కేటాయించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.కృష్ణ, ఎం.పద్మారాణి, డి.దాసు, బి.బిక్కు, కె.రాంబాబు, ఎస్‌కె.యాకూబ్‌పాషా, వరలక్ష్మి, జోస్పిన్, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖపై నిఘా పెట్టండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎలాంటి సమాచారం ఇవ్వకుండా డిసెంబర్ 28న ప్రభుత్వం తరపున నిర్వహించాల్సిన ఉద్యోగ మేళాను రద్దు చేశారని కలెక్టర్ అనుదీప్‌కు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మేళాకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగులు నిరాశతో వెనుదిరిగారని తెలిపారు. రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు తాను ట్రస్ట్ తరపున జనవరి 7న నిర్వహిస్తున్న జాబ్‌మేళా కారణంగానే ఈ ఉద్యోగ మేళాను రద్దు చేసినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు రాజకీయ నాయకుల రంగప్రవేశంతో దాదాపు వందమందికి ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు ఇప్పించుకునేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కీలక పదవిలో ఉండి ఒక ట్రస్టుకు చైర్మన్‌గా ఉండడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, దళిత ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జేబీ శౌరి, మాదిగ దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూసపాటి శ్రీనివాస్, గోండు సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, గిరిజన నాయకులు గోపి చౌహాన్, బానోత్ శోభన్ పాల్గొన్నారు.

హామీ అమలు కాకపోతే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న కందగట్ల సురేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే వరద బాధితుల తరపున ఐక్యంగా ఉద్యమిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు జేబీ బాలశౌరి, సీపీఐ జిల్లా నాయకురాలు కరీష రత్నకుమారి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కందగట్ల సురేందర్ హెచ్చరించారు. గోదావరి వరద బాధితులు, పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాచౌక్‌లో కొనసాగుతున్న నిరసన దీక్షకు శుక్రవారం నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఇంటిస్థలాలు ఇచ్చి, పట్టాలు మంజూరు చేయాలన్నారు. 146 రోజుల నుంచి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలంతా 437/1 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై హైకోర్టును ఆశ్రయిస్తే ఇంటిస్థలాలు మంజూరు చేసి, డబుల్‌బెడ్ రూంలు కట్టించి ఇవ్వాలని తీర్పు ఇచ్చిందని చెప్పారు. బూర్గంపాడు మండలం ముసలిమడుగు, రామాపురం ప్రాంతంలోని 437/1 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు గద్దం రాజశేఖర్, సురేష్, నరసింహారావు, సీపీఐ మహిళా సంఘం నాయకురాళ్లు షేక్ షాహినా, భాగ్యలక్ష్మి, షేక్ షమీం, భూలక్ష్మి, న్యూడెమోక్రసీ నాయకులు కుంజా కృష్ణ, బండ్ల వెంకటేశ్వర్లు, భూక్య కిషన్, ఈదునూరి సంజీవరావు, వైఎస్ రెడ్డి, మలికంటి రాము, ఆర్.లక్ష్మి, నాగన్న, భవాని, కుసుమ పాల్గొన్నారు.

మెయిన్స్‌కు అవకాశం కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం దున్నపోతుకు వినతిపత్రం అందజేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పోరాట సమితి (ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, వైజేఎస్ తెలుగు యువత, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, టీఎన్ఎస్‌యూ, యువజన, విద్యార్థి) సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి, దున్నపోతుకు పెద్ద తేడా లేదన్నారు. పరుగు పందెంలో ఉత్తీర్ణులైన ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులందరికీ మెయిన్స్‌కు అవకాశం కల్పించాలన్నారు. ప్రిలిమ్స్ ప్రాథమిక మల్టీపుల్ పరీక్షలో తప్పుగా వచ్చిన 7 ప్రశ్నలకు మార్కులు కలపాలన్నారు. కార్యక్రమంలో ఎస్కే నాగుల్‌మీరా, ఎస్కే సమీర్, గార్లపాటి పవన్, గుగులోత్ వంశీ, గార్లపాటి రమణయ్య, పాణిగంటి మహేష్, సమందల సందీప్, కిలారి నరేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

పార్కింగ్ తీరు మారదా?

కొత్తగూడెం బస్టాండ్ ప్రాంగణంలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్ తీరు మారే దాఖలాలు కనిపించడం లేదు. బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌ను నిరోధించాలని ఎన్ని చర్యలు చేపట్టినా అవి అమలు కావడం లేదు. కొత్తగూడెం బస్టాండ్‌లో ఇంతకుముందు విచ్చలవిడిగా వాహనాల పార్కింగ్‌ను దృష్టిలో పెట్టుకొని అధికారులు ఆ ప్రాంతంలో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దాని పక్కనే ఇలా మళ్లీ వాహనాలను యథేచ్ఛగా పార్కింగ్ చేస్తున్నారు. అధికారులు బైక్‌ల పార్కింగ్ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. – చుంచుపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : బి.వెంకటేశ్వరరావు, డీఎం, కొత్తగూడెం
సెల్ నంబర్ : 9959225959